ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 257 మంగళవారం 10-9-2024 ఎడిటర్ : వేములు అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై
# చర్య తీసుకోండి

**నాలుగు వారల్లోగా నిర్ణయం తీసుకోకుంటే సుమోటో కేసు**

**స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించిన హైకోర్టు**



తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్9: తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. 4 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశించింది. అప్పటిలోగా నిర్ణయం తీసుకోకపోతే సుమోటో కేసుగా విచారిస్తామని పేర్కొంది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. భారాస, భాజపా నేతలు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. పార్టీ మారిన దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై వేటు వేయాలని భారాస నేతలు పాడి కౌశిక్‌రెడ్డి, వివేకానందగౌడ్ పిటిషన్ వేశారు. దానంపై అనర్హత వేటు వేయాలని భాజపా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. వీటన్నింటిని కలిపి హైకోర్టు విచారించగా.. సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. ఈ విషయంలో సుప్రీంకోర్టు ఆదేశాలను స్పీకర్ పట్టించుకోవడం లేదంటూ పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కార్యాలయాన్ని ఆదేశిస్తూ తీర్పు వెలువరించింది. ఇదిలాఉంటే.. బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. పార్టీ దానం నాగేందర్, తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి పై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానందగౌడ్‌తో పాటు.. బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పుతో పాటు పలు రాష్టాల్లోని న్యాయ స్థానాల తీర్పులను, ఫిరాయింపు చట్టం నిబంధనలను కోర్టు దృష్టి తీసుకెళ్లారు. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ధర్మాసనం.. పలు దఫాలుగా వాదనలు విన్నది. అనంతరం తీర్పును సోమవారం ఉదయానికి వాయిదా వేసింది. ఈ కేసులో హైకోర్టు ఏం తీర్పు ఇస్తుందోనని అంతా ఉత్కంఠగా ఎదురు చూశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలంటూ స్పీకర్ కార్యాలయ కార్యదర్శిని ఆదేశించింది న్యాయస్థానం. స్పీకర్ కార్యాలయం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అన్న ఉత్కంఠ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో కలుగుతోంది.

# విమర్శలకే ప్రతిపక్షం పరిమితం

**నిర్మాతాత్మక పాత్ర విస్మరణ**

**మండిపడ్డ పిసిసి చీఫ్ మహేశ్ కుమార్**

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్ 9:** ప్రతిపక్షాలు ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి విమర్శలు చేస్తున్నాయని టీపీసీసీ చీఫ్ బి.మహేష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏడున్నర లక్షల కోట్ల అప్పు పెట్టి తమ చేతిలో రాష్ట్రాన్ని పెట్టి పోయాడు కేసీఆర్ అంటూ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతూ హామీలను అమలు చేస్తున్నారని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తుందని స్పష్టం చేశారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. 'నాయకులకు.. కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నారు.. ప్రభుత్వం మనదే మరింతగా కష్టపడి పని చేయండని అంటూ పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుస్తామన్నారు. ప్రభుత్వాన్ని.. పార్టీని.. సమన్వయం చేసుకుంటూ ముందు వెళ్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ వెల్లడించారు. ఈుగా... సోమవారం ఉదయం కాంగ్రెస్ నేత మైనంపల్లి ఇంటికి టీపీసీసీ చీఫ్ వెళ్లారు. ఖమ్మం వరద బాధితులకు కాంగ్రెస్ సీనియర్ నేత మైనంపల్లి హనుమంతరావు సహాయం చేస్తున్నారు. ఈ సందర్భంగా నిత్యావసర సరుకుల వ్యాన్‌లను టీపీసీసీ చీఫ్ జెండా ఊపి ప్రారంభించారు. వరద బాధితులకు నిత్యావసర సరుకులను మైనంపల్లి పంపిణీ చేయనున్నారు. 50లక్షల రూపాయల విలువ చేసే సరుకులను ఖమ్మంకు పంపించారు. ఈ క్రమంలో మైనంపల్లి నివాసంలో జెండా ఊపి సరుకుల వ్యాన్‌లను మహేష్ కుమార్ ఖమ్మంకు పంపారు. 25 కేజీల బియ్యం బ్యాగ్‌తో పాటు 11 రకాల సరుకులను వెయ్యి కుటుంబాలకు పంపిణీ చేయనన్నారు.

# బీసీ కమిషన్ చైర్మన్‌గా నిరంజన్ బాధ్యతలు

**తొలి సమయం హైదరాబాద్, సెప్టెంబర్ 9:** బీసీ కమిషన్ చైర్మన్ గా కాంగ్రెస్ సీనియర్ నేత నిరంజన్ బాధ్యతలు తీసుకున్నారు. అలాగే సభ్యులుగా రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి లు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఖైరతాబాద్ లోని కమిషన్ కార్యాలయంలో జరిగిన ఈ పదవీ ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తోపాటు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన, వీ హనుమంత రావు, బీసీ కమిషన్ అధికారులు హాజరయ్యారు. వీరిని మంత్రి తదితరులు అభినందిచారు.

## హైదరాబాద్-నాగపూర్
# మధ్య వందే భారత్

**15న ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి**



**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్ 9:** తెలంగాణ గడ్డ నుంచి మరో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు పరుగులు పెట్టనుంది. సికింద్రాబాద్ –నాగ్‌పుర్ స్టేషన్ల మధ్య ఈ సెమీ హైస్పీడ్ రైలు సర్వీసులందించేందుకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 15న ప్రధాని నరేంద్ర మోదీ వందే భారత్ రైలును వర్చువల్‌గా ప్రారంభిస్తారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోమవారం అధికారికంగా వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ నుంచి పలు ప్రాంతాలకు నాలుగు వందే భారత్ రైళ్లు సేవలందిస్తుండగా.. ఐదో రైలు ఈ నెల 15నుంచి పరుగులు పెట్టబోతోందన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు రెండు నగరాల మధ్య 578 కి.మీల దూరాన్ని కేవలం ఏడు గంటల 15 నిమిషాల్లోనే పూర్తి చేస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. షెడ్యూల్ ప్రకారం.. ఈ రైలు నాగ్‌పుర్‌లో ఉదయం 5 గంటలకు బయల్దేరి.. మధ్యాహ్నం 12.15గంటలకు సికింద్రాబాద్ చేరుకోనుంది. తిరిగి మధ్యాహ్నం 1 గంటకు సికింద్రాబాద్‌లో బయల్దేరి.. రాత్రి 8.20గంటలకు నాగ్‌పుర్ చేరుకుంటుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. కాజీపేట, రామగుండం, బల్లార్షా, చంద్రాపుర్, సేవాగ్రామ్ స్టేషన్లలో ఈ రైలు ఆగుతుందని తెలిపారు.

## బీమా పాలసీలపై జీఎస్టీ
# నిర్ణయం వాయిదా

**- క్యాన్సర్ మందులపై జీఎస్టీ 5శాతానికి తగ్గింపు - స్నాక్స్‌పై 18 శాతం నుంచి 12 శాతానికి కుదింపు**

**- జీఎస్టీ మండలి భేటీలో నిర్మలా సీతారామన్ నిర్ణయం**



**న్యూఢిల్లీ,సెప్టెంబర్ 9:** జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ తగ్గింపు నిర్ణయం వాయిదా పడింది. నవంబర్‌లో జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో దీనిపై నిర్ణయం వెలువడనుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో భేటీ అయిన 54వ జీఎస్టీ మండలి.. ఈ అంశంపై మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇదే భేటీలో క్యాన్సర్ ఔషధాలపై, స్నాక్స్‌పై జీఎస్టీ తగ్గిస్తూ నిర్ణయం వెలువడింది. కౌన్సిల్ సమావేశం అనంతరం సమావేశం వివరాలను విలేకరుల సమావేశంలో మంత్రి వెల్లడించారు. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీని రద్దు చేయాలన్న డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ ఈ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలోనే నిర్ణయం వెలువడుతుందని అందరూ ఆశించారు. దీనిపై సుదీర్ఘంగా చర్చించిన మండలి.. మంత్రుల బృందానికి ఆ బాధ్యతను అప్పగించింది. బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌధరి నేతృత్వంలో జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందానికే ఈ బాధ్యతనూ కట్టబెట్టంది. కొంతమంది కొత్త సభ్యులు ఈ బృందంలో చేరతారని, అక్టోబర్ చివరి నాటికి నివేదిక సమర్పిస్తారని నిర్మలా సీతారామన్ తెలిపారు. దీనిపై నవంబర్‌లో జరిగే భేటీలో నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. క్యాన్సర్ ఔషధాలపై ప్రస్తుతం 12 శాతంగా ఉన్న జీఎస్టీ రేటును 5 శాతానికి తగ్గిస్తూ కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. స్నాక్స్‌పై 18 శాతం నుంచి 12 శాతానికి జీఎస్టీని తగ్గిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2026 మార్చి తర్వాత జీఎస్టీ పరిహార సెస్సు కొనసాగించాలా? వద్దా? అనే అంశంపైనా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. జీఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ, ఆన్‌లైన్ గేమింగ్‌పై జీఎస్టీ అంశాలపైనా చర్చించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ గేమింగ్, క్యాసినోల స్థితిగతులను సమావేశంలో ప్రదర్శించామన్నారు. 'క్యాసినో ఆదాయం 30శాతం పెరిగింది. ఆరోగ్య బీమాపై మంత్రుల బృందం అక్టోబర్ చివరి నాటికి నివేదికను సమర్పిస్తుంది. జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో ఆరోగ్య బీమాపై జీఎస్టీని ఎత్తివేసే నిర్ణయం తీసుకోలేదు. ఆ నిర్ణయాన్ని ప్రస్తుతానికి వాయిదా వేశాం. ఆరోగ్య బీమాపై రేటును అంచనా వేయడానికి జీఎస్టీ కౌన్సిల్ మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసింది. మంత్రుల బృందం అక్టోబర్ చివరి నాటికి నివేదిక అందిస్తుందని నిర్మలా వెల్లడించారు. తీర్థయాత్రల కోసం హెలికాప్టర్ సేవల నిర్వహణపై పన్ను ఐదు శాతానికి తగ్గించాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఉత్తరాఖండ్ మంత్రి ప్రేమ్ చంద్ అగర్వాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. కేదార్‌నాథ్, బద్రీనాథ్ తదితర మతపరమైన తీర్థయాత్రలకు భక్తులను తీసుకెళ్లే హెలికాప్టర్ సేవలపై 18శాతం నుంచి 5శాతానికి పన్ను తగ్గించామన్నారు. వివిధ వర్గాల ప్రజలకు ఉపయోగపడేవిధంగా జీఎస్టీ కౌన్సిల్ నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు. దీంతోపాటు 2026 మార్చి తర్వాత జీఎస్టీ సెస్ కొనసాగింపుపై మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేయాలని సమావేశం నిర్ణయించింది.

# పర్యావరణహితంగా గ్రీన్ ఫార్మాసిటీ

**- సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలి - ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**



**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్ 9:** హైదరాబాద్ శివారులోని గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధిని వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యావరణహితంగా కాలుష్య రహితంగా ఉండేలా గ్రీన్ ఫార్మా సిటీ అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.సోమవారం సచివాలయంలో సీఎంతో పాటు పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు, సీఎస్ శాంతికుమారి గ్రీన్ ఫార్మా సిటీ ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించారు. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలో ముచ్చర్ల ప్రాంతంలో ఇప్పటికే ఎంపిక చేసిన పరిసరాల్లో గ్రీన్ ఫార్మా సిటీని అద్భుతంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. పరిసర ప్రాంతాల ప్రజలకు ఇబ్బంది లేకుండా పరిశ్రమల అభివృద్ధి జరగాలన్నారు. అక్కడ అభివృద్ధికి అవసరమైన రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాల నిర్మాణాలను వీలైనంత తొందరగా చేపట్టాలని సీఎం ఆదేశించారు. భవిష్యత్తు అవసరాలను అంచనా వేసుకొని, వాటికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు ఉండాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకొని పనులు చేయాలని సూచించారు. గ్రీన్ ఫార్మా సిటీలో పెట్టుబడులకు ఇప్పటికే పేరొందిన ఫార్మా కంపెనీలు ముందుకు వస్తున్నాయని, త్వరలోనే ఆ కంపెనీలతో సంప్రదింపులు జరుపుతామని సీఎం తెలిపారు. ఔషధాల తయారీ కంపెనీలు, బయోటెక్ అండ్ లైఫ్ సైన్సెస్ కంపెనీలకు కొత్తగా నెలకొల్పే అత్యాధునిక గ్రీన్ ఫార్మా సిటీ సింగిల్ స్టాప్‌గా ఉండాలని అభిప్రాయపడ్డారు. యాంటీ బయాటిక్స్, ఫెర్మంటేషన్ ఉత్పత్తులు, సింథటిక్ డ్రగ్స్, రసాయనాలు, విటమిన్లు, వ్యాక్సిన్లు, డ్రగ్ ఫార్ములేషన్స్, న్యూట్రాస్యూటికల్స్, హెర్బల్ ఔషధ ఉత్పత్తులు, ప్రత్యేక రసాయనాలు, కాస్మోటిక్స్ తదితర సంబంధిత ఉత్పత్తులన్నింటికీ ఫార్మా సిటీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. పరిశోధన, అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. పరిశోధన, శిక్షణ, నైపుణ్యాలకు అవసరమైన ప్రత్యేక విశ్వ విద్యాలయం ఉంటుందని అన్నారు. హెల్త్ కేర్, ఫార్మా రంగంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా అందులో కోర్సులు నిర్వహించాలని సూచించారు.

# భారీ వర్షాలతో తెలంగాణకు తీవ్ర నష్టం

**- కూలిపోయిన, దెబ్బతిన్న వారికి ఇందిరమ్మ ఇండ్లు - ప్రతి కుటుంబానికి రూ.16,500 ఆర్థిక సహాయం**

**- మృతుల కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లుతో పాటు రూ. 5 లక్షలు - ముపునకు గురైన ప్రతి ఎకరానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం**

**డాక్యుమెంట్స్ కొట్టుకుపోయాయని ఆందోళన చెందొద్దు - రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి**

**తొలి సమయం డెస్క్ హైదరాబాద్, సెప్టెంబర్ 9:** వరద ప్రభావిత ప్రాంతాలలో యుద్ధ ప్రతిపాదికన బాధితులకు సహాయం అందించాలని మంత్రి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బాధితులకు ఈ ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని ఎవరూ ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి బాధితుని వరకు సహాయం అందిస్తామని ప్రకటించారు. భారీ వర్షాలు, వరదలకు రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని 33 జిల్లాలను వర్షాప్రభావిత జిల్లాలుగా ప్రకటించామని తెలిపారు.తెలంగాణ వ్యాప్తంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సోమవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. మున్సిపల్, వ్యవసాయ, పంచాయితీరాజ్, విద్యుత్, విద్య, రోడ్లు, హౌసింగ్, ఇరిగేషన్ అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఆయా శాఖలకు సంబంధించి ఎంత నష్టం జరిగింది, ఎన్ని నిధులు కావల్సిన అంశాలపై పకడ్బంధిగా అంచనా వేయాలని సూచించారు. కేంద్రానికి ప్రతిపాదించే నివేదికలలో పొందుపరచవలసిన అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి తయారు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వరద ప్రాంతాలలో ఎనుమరేషన్ కూడా పక్కాగా జరగాలని సూచించారు. ఆయా శాఖల పరంగా జరిగిన నష్టాన్ని ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. భారీ వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 33 మంది మృతి చెందారని ఇందులో ప్రధానంగా ఖమ్మంలో 6 మంది, కొత్తగూడెంలో 5 మంది, ములుగులో 4 మంది, కామారెడ్డిలో ముగ్గురు, వనపర్తిలో ముగ్గురు చనిపోయారని అధికారులు మంత్రికి వివరించారు. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని కూడా అందచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. వరదల వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఇండ్లు పూర్తిగా పాక్షికంగా కూలిపోయాయి. వీటిని వెంటనే గుర్తించి బాధితులకు రూ. 5 లక్షల రూపాయలతో ఉచితంగా ఇందిరమ్మ ఇళ్ళు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించి పక్రియను వెంటనే ప్రారంభించాలని సూచించారు. వర్షాలలో దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.16,500 చొప్పున సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఎలాంటి అవినీతి, అక్రమాలకు ఆస్కారం లేకుండా వరద సహాయం పూర్తిగా ఆ÷-లనైన్ ద్వారానే బాధితుల అకౌంట్లోకి జమ చేస్తున్నామని వెల్లడించారు. వరద సమయంలో గౌరవ ముఖ్యమంత్రి వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించినప్పుడు కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారని, అయితే జరిగిన నష్టాన్ని చూసి మానవతా ధృక్పథంతో రూ.16,500 కి పెంచినట్టు వెల్లడించారు. ఈ సహాయాన్ని ఈరోజు నుంచే బాధితులకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం లక్షలాది ఎకరాల పంట నష్టం వాటిల్లినట్లు అధికారులు మంత్రిగారికి తెలిపారు. వరద ముప్పుకు గురైన ప్రతి ఎకరానికి రూ.పదివేల ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. దాదాపు తెలంగాణ వ్యాప్తంగా 358 గ్రామాలు వరద ముప్పుకు గురి కాగా, దాదాపు 2 లక్షల మంది ప్రభావితం అయినట్లు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజల కోసం 158 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముందస్తు చర్యల వల్ల 2,454 మందిని రక్షించామని తెలిపారు. 13,494 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో ఆర్/బి, పంచాయితీరాజ్ విభాగాలకు సంబంధించి వేలాది కిలోమీటర్ల రహదారులు దెబ్బ తిన్నాయని, గ్రామీణ మారుమూల ప్రాంతాలలో ఇప్పటికే తాత్కాలిక మరమత్తులు చేపట్టి కొన్ని రోడ్లను పునరుద్ధరించామని శాశ్వత ప్రతిపాదికన మరమత్తులు చేపట్టడానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రెండు మూడు రోజుల్లో తయారు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అలాగే మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన మరమత్తులను శాశ్వత ప్రతిపాదికన చేపట్టాలని సూచించారు.

# ఓటుతో మంచిని ఎంచుకోవచ్చు !



**న్యూఢిల్లీ :**దేశంలో రాజకీయాల తీరు మారడం లేదు. ఉచిత పథకాలు, ఓట్ల కోసం డబ్బుల పందేరం వంటి చర్యలతో అధికారమే లక్ష్యంగా చేస్తున్న కుటిల యత్నాలు దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించవు. ప్రజలు కూడా ఉచిత పథకాలతో సంతృప్తి చెందడం వల్ల నష్టపోయేది వారే. ప్రతి ఎన్నికలోనూ పరిణతి చూపాల్సిన బాధ్యత ఓటర్లదే. ఓటు నమోదు చేసుకోవడం, దానిని సద్వినియోగం చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. రానున్న కొన్ని రోజుల్లో హర్యానా, జార్ఖండ్, ఢిల్లీ, కాశ్మీర్‌లలో ఎన్నికలు జరుగబోతున్నాయి. ఆయా రాష్ట్రాల ప్రజలు నాయకుల ఉపన్యాసాలకు ఉప్పొంగి పోకుండా ఆలోచన చేయాలి. వివేచనతో ఓటేయాలి. ఓటు మన భవిష్యత్‌కు సూచికగా గుర్తించాలి. ఇటీవల ఉచిత పథకాలకు ఆర్థికంగా అమలు చేయడానికి డబ్బులు ఎక్కడి నుంచి తెస్తారని ఎన్నికల సంఘం పార్టీలను కోరుతూ లేఖ రాయడం.. ఉచితాలతో ప్రజలే నష్టపోతారని ఆర్‌బిఐలోని ఓ ఉన్నతాధికారి చెప్పడం చూస్తుంటే ప్రజలు చైతన్యం కావాల్సి ఉంది. ప్రజలు సచ్ఛీల రాజకీయాలను కోరుకుంటున్నా.. వారిని ఉచితాలతో మభ్యపెట్టి దేశాన్ని వెనక్కి నెడుతున్నారు. గెలుపు కోసం ఎంతకైనా తెగించడంలో రాజకీయ పార్టీలు ఆరితేరాయని ఇటీవల జరిగిన ఎన్నికల్లో మరోమారు చూశాం. ఎన్నికలో ప్రజలు కూడా పెద్దగా ఎవరు గెలుస్తారు..ఎవరిని గెలిపించాలన్న ధోరణిలో లేరు. ఎవరు ఎంత డబ్బులు ఇస్తారా అన్నది మాత్రమే చూస్తున్నారు. ఓట్ల కోసం ఇక్కడ చేస్తున్న కసరత్తు అంతాఇంతా కాదు. ఓ రకంగా ఖరీదైనవిగా ఎన్నికలు మారుతున్నాయి. ఓటేసినంత మాత్రాన తాయిలాలు ఎందుకు ఇస్తున్నారో ప్రజలు తెలుసుకోవాలి. నాయకులు చిత్తశుద్ధితో పనిచేస్తున్నారా లేదా తెలుసుకోవాలి. అలా కాఉండా గుడ్డిగా డబ్బులకు, మద్యానికి, హామీలకు లొగింతే మునిగేది ప్రజలే అన్నది కూడా గుర్తించాలి. ఉచిత పథకాలను సంక్షేమంగా చెప్పుకుంటున్న నాయకులు ప్రజల అభివృద్ధిని కాంక్షించడం లేదు. ఉచితాలు, సంక్షేమాలు, అభివృద్ధి తదితర పథకాలపై విస్తృతమైన చర్చ సాగాలి. ఎక్కడో ఒక దగ్గర విభజన రేఖ గీయాలి. ఢిల్లీలో కొత్తగా ప్రయోగాలు చేయడానికి ఏమీ లేకున్నా సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చారు. దాని ప్రభావం పంజాబ్‌పై పడింది. సాగుచట్టాలపై మొండి వైఖరి కారణంగా పంజాబ్‌లో బిజెపి భారీ మూల్యం చెల్లించుకుందనే చెప్పాలి. అయితే పన్నుల రూపంలో వసూలు చేస్తున్న ఆదాయాన్ని పాలకులు సంక్షేమం పేరిట అప్పనంగా నగదు బదిలీలు, ఉచిత పంపిణీ పథకాలతో ప్రజలను ఓట్ల యంత్రాలుగా మారుస్తు న్నారు. ఇలాంటివన్నీ అభివృద్ధికి నిరోధకంగా తయారవుతుందని గుర్తించాలి. బతకాడానికి అవకాశాలు రావాలని ఆశిస్తున్నారు. ప్రజలకు కావాల్సింది సమస్యలను పరిష్కరించడం.. శాంతిభద్రతలను పరిరక్షించ దం..అవినీతికి దూరంగా ఉండడం ముఖ్యం. ప్రజలు విజ్ఞులు అయినా.. రాజకీయ నేతలను మించి ఆలోచన చేయగలిగినా..ఎన్నికలు వచ్చే సరికి తాయిలాలు లొంగిపోతున్నారు. ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కూడా అన్నాహజారే స్ఫూర్తితో అవినీతికి వ్యతిరేకంగానే రాజకీయాల్లోకి వచ్చారు. ఇకపోతే యూపిలో యోగి ఆదిత్యనాథ్ రాకుముందు ఉన్న యూపికి..నేటి యూపికి భారీ తేడాను గమనించవచ్చు. ఎస్పీ కాలంలో అక్కడ గూండారాజ్యం కొనసాగింది. ములాయం సిఎంగా ఉన్నప్పుడు, అఖిలేశ్ యాదవ్ సిఎం అయిన తరవాత కూడా ఇదే కొనసాగింది. గుండాలు తమ ఇష్టం వచ్చినట్లుగా రాజ్యాన్ని ఏలారు. యువకుడు, బాగా చదువుకున్న అఖిలేశ్ యూపిని చక్కదిద్దుతారని ప్రజలు ఊహించారు. కానీ ములాయం పాలనలో ఉన్న గూండారాజ్యమే కొనసాగింది. ఈ క్రమంలో ప్రధానంగా యూపిలో పాలనపై దృష్టి పెట్టిన యోగి గూండాలను నిర్దాక్షిణ్యంగా అణచివేశారు. అక్రమార్కులకు సింహస్వప్నంగా నిలిచారు. శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇసతున్నారు. గ్రామాల్లో ప్రజలు నిర్భయంగా తమ పనులు చేసుకునే విధంగా పాలనను తీర్చి దిద్దారు. రేపులు, దందాలు చేసే వారిని అణచివేశారు. ఈ క్రమంలోనే ప్రజలు మరోమారు యోగికి పట్టం కట్టారని తెలుసుకోవాలి. పాలకులు మంచిపాలన ఎలా ఇవ్వాలన్నది మరచి ఇప్పుడు ఉచిత పథకాలు, డబ్బుల పందేరాలపై ఆధారపడి గెలుపు ఎలా అనే సూత్రాన్ని పాటించాలను కుంటున్నారు. నిజానికి ప్రజలకు కావాల్సింది ఇది కాదు. వారికి ప్రశాంత జీవనం, బతకడానికి అవకాశాలు కావాలి. ఇవేవీ రాజకీయ నేతల ప్రణాళికలు ఉండవు. ప్రజలను ప్రేమతో గెలవాల్సిన పాలకులు ఎదుటి వారిని శతృవులుగా చూస్తున్నారు. సవాళ్లు విసురు తున్నారు. అభివృద్ధి, పాలన తదితర అంశాలనే ప్రధానంగా దృష్టి సారించకుంటే దేశం అధోగతి కాగలదు. ఆమ్ ఆద్మీ నేత అరవింద్ కేజ్రీవాల్ కూడా మెరుగైన పాలననే ప్రధానంగా ప్రచారం చేసినా ..ఆయన కూడా ఇప్పుడు ప్రజలకు తాయిలాలు ఇచ్చే ఆలోచనలతో పార్టీని ముందుకు తీసుకుని వెళుతున్నారు. ప్రతి ఎన్నికల్లో గెలుపోటములు సహజమే అయినా గెలిచిన వారి ప్రత్యేకతను మాత్రమే చర్చించాలి. విస్తరణ కాంక్షలో పార్టీలో ప్రజలకు తాయిలాలనే నమ్ముకుంటున్నారు. ఇందుకు కేజ్రీవాల్ భిన్నం కాదని నిరూపించు కున్నారు. పార్టీలు ఏవైనా ప్రజలు ఉచితాలకు దూరంగా ఉండాలి. ఓట్లను అమ్ముకోకుండా ఉండాలి. పార్టీల అధికారం కోసం తాము బలవుతున్నామని గుర్తించాలి. లేకుంటే దేశం అధోగతి పాలుకాక తప్పదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో శృతిమించుతున్న తాయిలాలపై పోరాడాలి. డబ్బుల పందేరాన్ని వ్యతిరేకించాలి. పన్నులు కట్టిన డబ్బులతో పందేరాలను నిలదీయాలి. అప్పుడే అభివృద్ధి అన్నది సాగుతుంది. లేకుండా గతుకుల రోడ్లు తప్పవు. అభివృద్ధి కనిపించదు. ప్రజలు మారితేనే రాజకీయాలు మారుతాయి.

# వైద్యురాలి తల్లిదండ్రులకు లంచం

### ఆరోపణలు తోసిపుచ్చిన సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కతా,సెప్టెంబర్9:** ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటనలో మృతురాలి తల్లిదండ్రులకు పోలీసులు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ వస్తున్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ సోమవారం కోల్‌కతాలో స్పందించారు. ఈ ఆరోపణలను ఆమె ఖండించారు. ఇటువంటి పని తమ ప్రభుత్వం ఎప్పుడు చేయదన్నారు. తమ ప్రభుత్వంపై వెల్లువెత్తిన ఈ ఆరోపణల వెనుక కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి ఉందని ఆరోపించారు. అందులో వామపక్ష పార్టీల ప్రమేయం సైతం ఉందని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు.తమ కుమార్తె హత్యాచార ఘటన కేసులో తాము మౌనంగా ఉండేందుకు కోల్‌కతా పోలీసులు తమకు లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ గత వారం మృతురాలి తండ్రి ఆరోపించారు. దీనిపై సీఎం మమతా బెనర్జీపై విధంగా స్పందించారు. చనిపోయిన వైద్యురాలి కుటుంబానికి తాను నగదు ఇవ్వాలని ప్రయత్నించలేదన్నారు. అయినా నగదు ఇవ్వడం ద్వారా ఆ కుటుంబానికి జరిగిన నష్టాన్ని మాత్రం పూడ్చలేమన్నారు. హత్యాచార ఘటనతో విగత జీవిగా మారిన 32 ఏళ్ల ట్రైయినీ వైద్యురాలు చిరస్థాయిగా నిలిచి ఉండేలా.. ఆమె స్మారకార్థం ఏదైనా చేయాల్సి ఉందని సీఎం మమతా స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం మృతురాలి కుటుంబ వైపునే ఉందని ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ పేర్కొన్నారు.మరోవైపు ఈ వైద్యురాలి హత్యాచార ఘటన అనంతరం రాష్ట్రంలో నిరసనలు వెల్లువెత్తాయని గుర్తు చేశారు ఆ సమయంలో కోల్‌కతా నగర పోలీస్ కమిషనర్ పదవికి రాజీనామా చేసేందుకు ఐపీఎస్ అధికారి వినీత్ గోయెల్ సిద్దపడ్డారన్నారు. కానీ మరికొద్ది రోజుల్లో కోల్‌కతా మహానగరంలో దసరా ఉత్సవాలు జరగ నున్నాయని.. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలపై అవగాహన ఉన్న వ్యక్తి ఆ పదవి నుంచి వైదొలిగితే ఎలా అని ఆయన్ని ప్రశ్నించానని సీఎం మమతా బెనర్జీ ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు.హత్యాచార ఘటన వెలుగులోకి వచ్చిన నాటి నుంచి పోలీసులు వ్యవహరించిన తీరుపై మృతురాలి తల్లిదండ్రులు తమ ఆక్రోశం వివిధ సందర్భాల్లో వెళ్లగక్కిన సంగతి తెలిసిందే. తమ కుమార్తె మృతదేహాన్ని చూసేందుకు ఆసుపత్రిలో మూడు గంటల పాటు వేచి చూడాల్సి రావడం.. మృతదేహాన్ని తమకు అప్పగించే సమయంలో ఓ సీనియర్ పోలీసు అధికారి నగదు తమకు ఇచ్చారని.. అయితే తాము దానిని తిరస్కరించామని మృతురాలి తండ్రి గత వారం ఆరోపించిన విషయం విధితమే.

## హైకోర్టు తీర్పు...పార్టీ మారిన వారికి చెంపపెట్టు

### సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యాఖ్య

**తొలి సమయం సూర్యాపేట,సెప్టెంబర్9:** బీఆర్ఎస్ బి ఫామ్ పై గెలిచి, పార్టీ మారిన ద్రోహులకు చెంప పెట్టులా హైకోర్టు తీర్పు వచ్చింది. ప్రజాస్వామ్యం పై నమ్మకం పెరిగేలా కోర్టు తీర్పు ఉంది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. నల్లగొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాకోర్టులో కూడా కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. వారిపై అనర్హత వేటు పడటం ఖాయమన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు రావడం ఖాయమని పేర్కొన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని స్పష్టం చేశారు. ఇక హైడ్రా పేరుతో రేవంత్ హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నడు. హైదరాబాద్ అంటేనే భయపడేలా చేసిండు. చట్టప్రకారం కాకుండా అడ్డగోలుగా బొల్డోజర్లతో రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు. రాజకీయ కక్ష సాధింపు చేస్తూ హైడ్రామా అడుతున్నాడు. రేవంత్ చర్యలు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నయని మండిపడ్డారు. అసలు చెరువులు ఎన్ని? వాటి హద్దులు ఎన్ని? అని నిర్ణయం జరగాలి. పేదలకు ఎలాంటి ఇబ్బందులు రావొద్దు. బడా బడా బాబుల విషయంలో ఒకలా పేదల విషయంలో ఒకలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# చివరి దశకు వరదలపై యుద్ధం

### - ఇది ముగిస్తే ఇక ఎపి పునర్నిర్మాణంపై దృష్టి - బుడమేరుపై జగన్ ప్రభుత్వం పాపాలు

### - 2.75లక్షల మంది తీవ్ర బాధలు పడ్డారు - బోట్లు ద్వారా ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టించే కుట్ర - జీవితాంతం ప్రజలకోసం పనిచేస్తా: చంద్రబాబు

**తొలి సమయం విజయవాడ,సెప్టెంబర్9:** వరదలపై యుద్ధం చివరి దశకు వచ్చిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ఈ యుద్ధం రేపటితో ముగిస్తే ఇక ఏపీ పునర్నిర్మాణంపై దృష్టి పెడతామని అన్నారు. సింగ్‌నగర్‌లో వరద వచ్చిన తొలిరోజు తాను పర్యటించినప్పటికీ, ఇప్పటికీ చాలా పురోగతి ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మొదటి రోజు ప్రజలు చాలా బాధగా ఉండటం చూశానని అన్నారు. 9వ రోజు ప్రభుత్వంపై పూర్తి నమ్మకం చూస్తున్నానని తెలిపారు. బుడమేరుపై జగన్ ప్రభుత్వం చేసిన పాపాల వల్ల 2.75లక్షల మంది తీవ్ర బాధలు పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా కొన్ని సందర్భాల్లో చివరి వ్యక్తికి సహాయం చేయలేకపోయామని అన్నారు. బోట్లు ద్వారా ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టించే కుట్ర పన్నారని విమర్శలు చేశారు. మొన్నటి వరకూ ఇసుక దొంగ వ్యాపారం చేసిన బోట్లను, ప్రజలను ముంచేందుకు పంపించారని ఆరోపించారు. గత ఏడాది ఇదే రోజు ఏ ఆధారం లేకుండా అక్రమ కేసులో నన్ను వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఆ రోజు ప్రజలంతా నా వెంట నిలిచారు. నా పట్ల అంత ఆదరణ చూపిన ప్రజల కోసం నా జీవితం అంకితం చేసి పని చేస్తా. నన్ను ఏ పేరుతో పిలిచినా పలుకుతూ, వారి మధ్యే ఉండి పని చేస్తా. ఈ రోజు ప్రజలకు కష్టం వస్తే నేనూ వారి మధ్య ఉన్నా. ఆ రోజూ బస్సులోనే ఉన్నా, ఈ రోజూ బస్సులోనే ఉన్నా. ప్రజల ముఖాల్లో నవ్వు చూద్దామనుకుంటుంటే, ఒక్కో ఇంట్లో ఒక్కో విషాద ఘటన ఉంది. అర్బన్ కంపెనీ సాయంతో పాడైన అన్ని వస్తువులు బాగు చేయిస్తున్నాం. ఈ యాప్ వినియోగంపై ప్రజల్లో చైతన్యం పెంచుతాం. ప్రజలు నిలదొక్కు కునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. జఠిలమైన సమస్యను సమన్వయంతో ప్రణాళికతో జాగ్రత్తగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఆప్కో, ఇతరత్రా దగ్గర ఎన్ని బట్టలు ఉంటే అన్నీ తెప్పించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంటిలో ఉండే వారికి తలా ఒక జత బట్టలు ఇస్తామని అని మాటిచ్చారు. అప్కో లేదా ఇతర సంస్థల నుంచి వెంటనే దుస్తులు తెప్పించి ఇచ్చే ప్రయత్నం చేయాలని సంబంధిత అధికారులకు సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇదిలా ఉంటే.. సోమవారం సాయంత్రం వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటించారు. విజయవాడలోని ఉర్మిలా నగర్, కవేలా సెంటర్, సింగ్ నగర్, పైపుల రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించి.. వరద బాధితులను పరామర్శించారు. ' ఒక్కో ఇంటికి ఒక్కో జత బట్టలు ఇస్తాము. చాలామంది బట్టలు పోయాయి అని చెబుతున్నారు. చెడిపోయిన వస్తువులను బాగు చేసేందుకు అర్బన్ కంపెనీకి బాధ్యతలు అప్పగిస్తాం. ఇన్సురెన్స్ క్లయిమ్ పెడితే వెంటనే ఇప్పిస్తాం. కాల్స్‌కు రెస్పాండ్ కావాలి. మీరు ఫీడ్ బ్యాక్ ఇస్తేనే మాకు నాణ్యమైన సేవలు అందించేందుకు వీలుంటుంది ' అని వరద బాధితులకు సీఎం సూచించారు. ఇదిలావుంటే ఇటీవల ప్రకాశం బ్యారేజీకి బోట్లు ఢీకొన్న ఘటనపై అధికారులు సీఎం చంద్రబాబుకు నివేదిక సమర్పించారు. ఈ ఘటనలో కుట్రకోణం ఉందని తెలిపారు. డ్యాంను ఢీకొన్న బోట్లు వైసీపీ నేతలు, కార్యకర్తలవేనని నిర్ధారించారు. వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్, మాజీ ఎంపీ నందిగం సురేష్ అనుచరుల బోట్లుగా గుర్తించినట్లు వెల్లడించారు. ఇసుక అక్రమ తవ్వకాలకు నందిగం సురేష్, ఉషాద్రికి చెందిన బోట్లనే వినియోగించుకునే వారని చెప్పారు. బోట్ల రిజిస్ట్రేషన్ల నెంబర్ల ద్వారా వాటి యజమానులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న బోట్లను ఉషాద్రి, కర్రి నరసింహా స్వామి, గూడూరు నాగమల్లీశ్వరిలకు చెందినవిగా గుర్తించారు. ఉషాద్రికి చెందిన 3 బోట్లను కలిపి కట్టడం వెనుకు కుట్ర కోణం దాగి ఉన్నట్లు చెప్పారు. సాధారణంగా మూడింటిని కలిపి కట్టరని.. వాటికి ఇనుప చైన్ల లంగరు వేయకుండా ప్లాస్టిక్ తాళ్లతో కట్టేసినట్లు పేర్కొన్నారు. తమ బోట్లతో పాటు సమీపంలోని మరో రెండింటిని కూడా కొట్టుకెళ్లేలా కుట్ర చేశారని నివేదికలో తెలిపారు. ఈ నెల 2న తెల్లవారుజామున 3 గంటల సమయంలో 5 బోట్లు ప్రకాశం బ్యారేజీ గేట్లను ఢీకొట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. అవి గేట్లకు ఉండే కౌంటర్ వెయిట్లకు కాకుండా బ్యారేజీ పిల్లర్లను బలంగా తాకితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండేదని చెప్పారు. మరోవైపు, పోలీసులు నిందితుల కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నారు. రామ్మోహన్, ఉషాద్రిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 2న ప్రకాశం బ్యారేజీకి 11.42 లక్షల క్యూసెక్కుల మేర వరద వచ్చి చేరింది. అదే రోజున వేకువజామున 3 గంటల సమయంలో ఎగువ నుంచి పడవలు కొట్టుకొచ్చి.. 67,68, 69 గేట్లను ఢీకొట్టాయి. వీటిలో ఒకటి ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. మరొకటి జాడ కనిపించలేదు. మిగిలిన వాటి వల్ల 2 గేట్లు దెబ్బతిన్నాయి. అయితే, దీనిపై కుట్ర కోణం ఉందనే అనుమానాలు వ్యక్తం కావడంతో ఇరిగేషన్ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకేసారి 4 బోట్లు రావడంపై సమగ్ర దర్యాప్తు చేయాలని చెప్పారు. అటు, ఈ ఘటనపై పోలీసుల దర్యాప్తులో పలు కీలక విషయాలు వెల్లడవుతున్నాయి. పడవల్ని కొద్దిరోజుల కిందటే ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని గొల్లపూడి వైపు తెచ్చి నిలిపారని.. అంతకు ముందు వరకూ అవి గుంటూరు జిల్లా వైపు ఉన్న ఉద్దండరాయునిపాలెం వైపు ఉండేవని తేలింది.

## తాలిపేరు ప్రాజెక్టుకి భారీగా వరదనీరు



**తొలి సమయం చర్ల/ సెప్టెంబర్ 09**

తెలంగాణలో గత నాలుగు రోజులుగా అల్పపీడనం ప్రభావంతో భారీగా వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో చర్ల మండలంలోని తాలు పేరు ప్రాజెక్టుకి భారీగా వరద నీరు వచ్చి చేరుతా ఉంది. తాలిపేరు పరిసర ప్రాంత వాసులు నదిలో సుమారుగా 1,50,000 క్యూసెక్కుల వరద నీరు వచ్చే పరిస్థితుల దృష్ట్యా పరిసర ప్రాంత వాసులు అప్రమత్తంగా వుండాలని ముఖ్యంగా చర్ల మండలంలో గల పెదమిడిసిలేరు, బి.కొత్తూరు, చినమిడిసిలేరు, ఆంజనేయపురం, దోసిల్లపల్లి, భూమిని లంక గుంపెనగుడెం గ్రామస్థులు అప్రమత్తంగా ఉండవలసిందిగా ఇరిగేషన్ అధికారులు తెలియపరచడమైనది.

## హింగే అశోక్ మరణం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్

**తొలి సమయం ఎల్కతుర్తి సెప్టెంబర్ 09**



ఎల్కతుర్తి మండల కేంద్రం లోని చింతలపల్లి గ్రామానికి చెందిన జన సముద్రం పాత్రికేయులు హింగే అశోక్ హఠాత్ మరణం పట్ల హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వోడితల సతీష్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అందరితో కలిసి మెలిసి ఉండే మంచి మనస్తత్వం, పాత్రికేయ వృత్తికి సరియైన నిర్వచనం అశోక్ అన్నారు. ఆయన మరణం వారి కుటుంబ సభ్యులకు తీరని లోటు అని ప్రగాఢ సంతాపం తెలిపారు వారి కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు.

## తెలంగాణ హైకోర్టు అద్భుతమైన తీర్పు

### ఇన్సెంటివ్స్ ఇచ్చి పార్టీలో చేర్చుకున్న కాంగ్రెస్

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్9:** ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు అద్భుతమైన తీర్పు ఇవ్వటాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణలో ఇన్సెంటివ్స్ ఇచ్చి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారని ఆరోపణలు చేశారు. సోమవారం నాడు తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ డబుల్ స్టాండ్ ఏంటి అని ప్రశ్నించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఒకలా... తెలంగాణలో మరోలా కాంగ్రెస్ నేతలు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు చేశారు. తెలంగాణలో ఇన్సెంటివ్స్ ఇచ్చి పార్టీలో చేర్చుకున్నారని ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్యారెక్టర్ లేదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ సబ్ రీజనల్ పార్టీగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి అవినీతి సొమ్ముతో పది మంది ఎమ్మెల్యేలను రూ.1000 కోట్లు పెట్టి కొన్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఒక్క నెలలో హైదరాబాద్ రోడ్ల మీద ఖైరతాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను ఉరికిస్తామని పాడి కౌశిక్‌రెడ్డి మాస్ వార్నింగ్ ఇచ్చారు. హైకోర్టు తీర్పు బీఆర్ఎస్ పార్టీకి విజయమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ అన్నారు. తెంగాణ అసెంబ్లీ స్పీకర్ స్వతంత్రంగా వ్యవహరించి.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరారు. స్పీకర్ మీద తమకు పూర్తి విశ్వాసం ఉందని వివేకానంద గౌడ్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక విధానం తెలంగాణలో మరో విధానమా అని ప్రశ్నించారు. అనర్హత వేటు విషయంలో కాలయాపన చేస్తే అపహాస్యం కాక తప్పదని విమర్శలు చేశారు. మూడు స్థానాలకు ఉప ఎన్నికలు రాబోతున్నాయని స్పష్టం చేశారు. ముగ్గురు ఎమ్మెల్యేలతో మిగతా వారిపై కూడా నిర్ణయం తీసుకుని వేటు వేయాలని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ తెలిపారు.

## హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

### స్పీకర్ నిర్ణయం తీసుకోక తప్పదు

### మాజీ ఎంపి వినోద్ కుమార్ వ్యాఖ్య



**తొలి సమయం వరంగల్,సెప్టెంబర్9:** పార్టీ మారిన ఎమ్మెల్యేలకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పుపై మాజీ ఎంపీ వినోద్ కుమార్ స్పందించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. పార్టీ మారిన ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావ్‌పై విచారణ జరిగిందని.. సుదీర్ఘ వాదనలు జరిగాయన్నారు. నాలుగు వారాల్లో విచారించి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ నిర్లక్ష్యం చేస్తే తామే విచారణ చేస్తామని హైకోర్టు చెప్పిందన్నారు. స్పీకర్ చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు. 1985లో రాజీవ్ గాంధీ 52వ షెడ్యూల్ సవరణ ద్వారా పార్టీ మారే, పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించే వారిపై అనర్హత వేటు వేయాలని చట్టం తెచ్చారన్నారు. ఒక సమయం దానిలో పెట్టకపోవడమే ఇన్ని అనర్దాలకు కారణమన్నారు. 39 ఏళ్ల క్రితం చట్టం వచ్చినా అందులో లోసుగులు ఉండడం కొందరికి ఉపయోగంగా మారిందని తెలిపారు. ప్రధాని మోదీ అన్నీ నీతిలే చెప్తారని.. ఎన్నో చట్ట సవరణలు తెచ్చిన మోడీ ఈ చట్ట సవరణ చేయరని మండిపడ్డారు. శాసనసభ స్పీకర్ కోర్టుతో చీవాట్లు తినాలా? అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ, ఖర్గే మాటలను తెలంగాణ స్పీకర్ వినకుండా విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దేశంలోని రాజకీయ పార్టీలు పట్టుబట్టి 10వ షెడ్యూల్ రద్దు చేయాలన్నారు. స్పీకర్‌కు 4, 6 వారాల్లో నిర్ణయం తీసుకునేలా చట్ట సవరణ చేయాలన్నారు. మోడీ ప్రభుత్వం వెంటనే 10వ షెడ్యూల్ రద్దు చేయకుంటే ప్రజలు ప్రజాస్వామ్యం పట్ల ప్రజలకు గౌరవం కోల్పోతారన్నారు. ఆనాడు చట్టం తెచ్చినప్పుడు రాజీవ్ గాంధీ ఇలాంటి స్పీకర్లు ఉంటారని అనుకోలేదన్నారు. చట్టంలో ఏ నేత తప్పు చేయకుండా చేయాలని.. తప్పు చేసే ఆస్కారం ఉండకుండా చూడాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ వ్యాఖ్యలు చేశారు.

## పార్టీలు మారడం ప్రజాస్వామ్య విరుద్ధం

### హైకోర్టు తీర్పును స్వాగతించిన బిజెపి ఎంపి లక్ష్మణ్

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్9:** తెలంగాణలో కాంగ్రెస్ అసమర్థ పాలన సాగిస్తోందని రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. సీఎం, మంత్రులు ఢిల్లీ పర్యటనలు చేస్తున్నారు తప్పితే.. ప్రజలకు ఒరిగేదేమీ లేదన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం, మంత్రులు ఢిల్లీకి గులాములుగా మారారని ఎద్దేవా చేశారు. ప్రజావైద్యం పూర్తిగా పడకేసింది, పేదలు చదువుకునే గురుకులాలను నిర్వీర్యం చేశారు. ప్రజల దృష్టిని మరల్చేందుకు హైడ్రాను తెరపైకి తెచ్చారు. చట్టం చేయకుండా జీవో ద్వారానే హైడ్రాను నడుపుతున్నారు. ఉచిత బస్సు ప్రయాణం పెట్టి బస్సుల సంఖ్యను తగ్గించారు. రైతుబంధు రాక, రుణమాఫీకాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్ 9 నెలల పాలనలో 400 మందికిపైగా రైతులు చనిపోయారు. రుణమాఫీ పేరుతో కాంగ్రెస్ చేసిన మోసానికి సురేందర్‌రెడ్డి ఆత్మహత్యే తార్కాణం. ఫసల్ బీమా అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పింది.. కానీ ఇప్పటి వరకు దాని ఊసే ఎత్తట్లేదు. బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆందోళన బాట పడితే ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యేల పార్టీమార్పుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలో చేరి మంత్రి అవుతున్నారు. భారాస తరహాలోనే కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోంది. ఎమ్మెల్యేల పార్టీ మార్పుపై స్పీకర్ నిర్ణయం తీసుకోకుంటే కోర్టు నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుకుంటున్నారు. భాజపా విలువలతో కూడిన రాజకీయాలను కోరుకుంటోందని లక్ష్మణ్ అన్నారు.

# పోటెత్తిన జనం మధ్య సూర్నపు సావిత్రి అంతిమ యాత్ర

## యాత్ర చివరి వరకు కదిలిన రాజకీయ ప్రముఖులు









**తొలి సమయం, మహబూబాబాద్ 9:** మున్సిపాలిటీ సిపిఎం ఫ్లోర్ లీడర్, మాజీ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ సిపిఎం సీనియర్ లీడర్ సూర్నపు సోమయ్య సతీమణి సావిత్రి మృతి చెందారు, పార్థివ దేహాన్ని ఆమె స్వగృహం లో జనం సందర్శనార్థం ఉంచారు.. ఉదయం అంతిమ సంస్కారంలో భాగంగా అంతిమ యాత్ర ప్రారంభం అయ్యింది.. సిపిఎం పార్టీ శ్రేణులు అనుబంధం మహిళా సంఘం, కార్యకర్తలు,మరియు జనం పోటెక్కారు. ఈ కార్యక్రమం లో సిపిఎం జాతీయ కమిటీ మెంబెర్ నాగయ్య, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్.రాజమౌళి, దర్గయ్య, రాజన్న, మహిళా సంఘం నాయకులు స్థానికశాసనసభ్యులు డాక్టర్ భూక్యా మురళీ నాయక్, ఎడ్ల రమేష్ మున్సిపాలిటీ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, దేవరం ప్రకాష్ రెడ్డి,పోతురాజు,డోలి సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్ ఆరికోట్ల రవి యాళ్ల మురళీ ధర్ రెడ్డి లు అంతిమ యాత్ర చివరి వరకు కొనసాగారు.

# తెలంగాణ విద్యార్థులకు హ్యాండ్లూమ్ కోర్సులు

### - విద్యార్థులు ఇతర రాష్ట్రాల్లోకి వెళ్లకుండా వెసలుబాటు - ఇన్‌స్టిట్యూట్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు

### - నాంపల్లిలో ఐఐహెచ్‌టీని వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం రేవంత్

**తొలి సమయం హైదరాబాద్,సెప్టెంబర్9:** తెలంగాణ విద్యార్థులకు హ్యాండ్లూమ్ కోర్సులు అందుబాటులోకి వచ్చాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. సోమవారం నాంపల్లిలో ఐఐహెచ్‌టీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ ని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐఐహెచ్‌టీని ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. తెలంగాణ విద్యార్థులు ఏపీ, ఒడిశా రాష్ట్రాలకు వెళ్లి హ్యాండ్లూమ్ కోర్సులు చదవాల్సి వస్తోందని అన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో మాట్లాడి ఐఐహెచ్‌టీకి అనుమతులు తెచుకున్నామని ఈ సందర్భంగా వెల్లడించారు. విద్యార్థుల సమయం వృథా కాకూడదని, తెలుగు యూనివర్శిటీలో ఐఐహెచ్‌టీలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. వచ్చే ఏడాది ఐఐహెచ్‌టీని స్కిల్ యూనివర్సిటీకి తరలిస్తామని చెప్పారు. ఒక్కో విద్యార్థికి నెలకు 2500 స్టై ఫండ్ ఇస్తామని హామీ ఇచ్చారు.గతంలో సినీ తళుకు బెళుకులు కూడా చేనేతకి తెచ్చారు. కానీ నేతన్నల రాత మారలేదు. గతంలో సిరిసిల్లలో కార్మికులకు బకాయిలు పెట్టారు. ఆ మొత్తం మేము అధికారంలోకి వచ్చాక విడుదల చేశాం. బతుకమ్మ చీరలకు కట్టుకునే స్థాయిలో నాణ్యత లేవు. మంచి డిజైన్‌తో సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ మహిళలకు ఒక్కొక్కరి ఏడాదికి 2 చీరలు ఇస్తాం. బతుకమ్మ చీరలు ఆగిపోయాయని ఆలోంచాల్సిన అవసరం లేదు అని రేవంత్ రెడ్డి అన్నారు. నేతన్నలకు రుణమాఫీ ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రుణమాఫీకి ఇప్పుడే ఆదేశాలు ఇస్తున్నామని అన్నారు. ' మీ సమస్యల పరిష్కారానికి మీ అన్నగా ఎప్పుడు ముందు ఉంటా. కొడంగల్ నియోజక వర్గంలోని నేతన్నలతో నాకు మంచి సంబంధాలు ఉన్నాయి. నేతన్న కొండా లక్ష్మణ్ బాపూజీ వారసులు. త్యాగాలు చేస్తే ఎలా వేలాది కోట్ల ఆస్తులు సంపాదించారు. పదవిని తృణప్రాయంగా త్యాగం చేసింది కొండా లక్ష్మణ్ బాపూజీ' అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఐఐహెచ్‌టీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును పెట్టాలని అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. కేసీఆర్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ నిలువ నీడ ఇచ్చారని సీఎం రేవంత్ తెలిపారు. నాంపల్లిలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని వర్చువల్‌గా ప్రారంభించారు. లలిత కళాతోరణంలో ఇందుకు సంబంధించిన ప్రారంభోత్సవం నిర్వహించారు. చేనేత అభయహస్తం లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ కార్యాలయం ఏర్పాటుకు కొండా లక్ష్మణ్ బాపూజీ స్థలం ఇచ్చారన్నారు. తెలంగాణ కోసం పదవులను తృణప్రాయంగా వదులుకున్నారని చెప్పారు. కానీ కొంత మంది రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలు, ఉపఎన్నికలు తెచ్చారన్నారు. ఆ ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లు చేసి త్యాగమని చెప్పుకొంటున్నారని విమర్శించారు. గజ్వేల్‌లో ఫాంహౌస్‌లు ఏర్పాటు చేసుకున్నారన్నారు. కేసీఆర్, కొండా లక్ష్మణ్ బాపూజీ త్యాగాలకు తేడా గమనించాలన్నారు. ఉప ఎన్నికల్లో సెలక్షన్లు, కలెక్షన్లతో బాగుపడిందెవరో ప్రజలకు తెలుసన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ ఎప్పుడూ గుర్తిస్తుందని చెప్పారు. ఐఐహెచ్‌టీకీ కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకుందామన్నారు. ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలని ప్రధాని, కేంద్రమంత్రులను కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. వారు రాజకీయాలకు అతీతంగా ముందుకు వచ్చి తక్షణమే మంజూరు చేశారని చెప్పారు. నాంపల్లి తెలుగు వర్సిటీలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో చేనేతల జీవన విధానంలో మార్పులు రాలేదు. సిరిసిల్ల నేతన్నలకు బకాయిలు చెల్లించలేదు. కాంగ్రెస్ వచ్చాక వెంటనే వాటిని విడుదల చేశాం. 63 లక్షల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు ఉన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏటా 2 చీరలు ఇవ్వాలని నిర్ణయించాం. చేనేతల రుణభారం రూ.30 కోట్లు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కుల, చేతి వృత్తులకు సముచిత న్యాయం చేస్తాం అని రేవంత్‌రెడ్డి తెలిపారు. నైపుణ్యం గల చేనేత కళాకారులు, నూతన ఆవిష్కర్తల కోసం ఐఐహెచ్‌టీ ప్రారంభించారు. చేనేత రంగంలో ఆవిష్కర్తల ప్రోత్సాహానికి ప్రత్యేక కోర్సులు, శిక్షణ కార్యక్రమాలను ఇక్కడ అందించనున్నారు. అధునాతన పరిశోధన అవకాశాలను ఈ సంస్థ కల్పించనుంది. ఏటా 60 మందికి టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా కోర్సులు ఇవ్వనున్నారు. రైతన్న, నేతన్నలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. చేనేత సమస్యలకు సాంకేతికతే ముఖ్య కారణం. చేనేత ఉత్పత్తులు ప్రపంచానికి ఎగుమతులు కావాలి. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. మన పిల్లలకు మన నైపుణ్యం అందించేందుకు ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తాం. అతి తక్కువ సమయంలో కేవలం 10 రోజుల్లోనే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేశాం. ప్రస్తుతానికి ఐఐహెచ్‌టీ తరగతులు తెలుగు వర్సిటీలో అందిస్తున్నాం. త్వరలో ఐఐహెచ్‌టీని స్కిల్ వర్సిటీకి తరలింపు. నేతన్నల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు కృషి. చిన్న వయస్సులోనే రేవంత్ సీఎం అయ్యారు. అన్ని వర్గాలకు న్యాయం చేయాలని కృషి చేస్తున్నారని అన్నారు.

# వరదబాధితులకు చిన్నారుల అండ

### - 31 వేలు సేకరించి అందచేత - విద్యార్థుల చేయూతకు చలించిన చంద్రబాబు

**తొలి సమయం అమరావతి,సెప్టెంబర్9:** ఆంధ్రప్రదేశ్‌లో గత కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు విజయవాడ అతలాకుతలం అయిన సంగతి తెలిసిందే. ఎటు చూసినా హృదయ విదారక దృశ్యాలే. వరద బాధితులను ఆదుకోవడానికి సినీ, రాజకీయ.. పలు రంగాలకు చెందిన ప్రముఖులు ముందుకొచ్చి.. తమ వంతుగా విరాళాలు ప్రకటించారు. ఇందులో కొందరు నేరుగా సీఎం సహాయ నిధికి ట్రాన్స్‌ఫర్ చేయగా.. మరికొందరు నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి చెక్కులు అందజేశారు. ఇలా సామాన్యుల నుంచి సెలబ్రిటీ వరకూ విరాళాలు ప్రకటిస్తూ పెద్ద మనసు చాటుకున్నారు. అయితే.. తాజాగా ఓ మారుమూల గ్రామంలోని స్కూల్ చిన్నారులు.. వరద బాధితుల కోసం మేము సైతం అంటూ ముందుకొచ్చారు. ఒక్క మాటలో చెప్పాలంటే చిట్టి చేతులతో పెద్ద సాయమే చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను ట్విట్టర్ వేదికగా షేర్ చేసిన సీఎం చంద్రబాబు ఎమోషనల్ అయ్యారు. ఓ మారుమూల గ్రామంలో స్కూల్ చిన్నారుల పెద్ద మనసు చూసి సీఎం చలించిపోయారు. ఈ వీడియో నిజంగా తన విషయంలో ఈ రోజును గొప్పగా మార్చింది అంటూ ఎక్స్ వేదికగా చంద్రబాబు ట్వీట్ చేశారు. పూర్తి వివరాల్లోకెళితే.. ' పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం, పడమర విప్పర్రు గ్రామంలోని శ్రీ విద్యా నికేతన్ పాఠశాలకు చెందిన ఈ చిన్నారులు పెద్ద వాళ్లకు కూడా ఆదర్శంగా నిలిచారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి తమ పాకెట్ మనీని విరాళంగా ఇచ్చి.. అసాధారణ కరుణను ప్రదర్శించారు. మొత్తం 31 వేల రూపాయలు సేకరించి అందించడం నిజంగా చాలా గ్రేట్. విద్యార్థుల్లో ఇలాంటి ఉదాత్తమైన విలువలను పెంపొందించడం పట్ల స్కూలు యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను.అవసరం ఉన్న వారి పట్ల శ్రద్ధ వహించడం సాయం చేయడాన్ని వారికి బోధించడం చాలా గొప్ప విషయం. ఈ విలువలను విద్యార్థులు పాటించేలా చూసిన పాఠశాల యాజమాన్యాన్ని నేను అభినందిస్తున్నాను. ఇటువంటి సంఘటనలు మానవత్వంపై మన విశ్వాసాన్ని పునరుద్ధరిస్తాయి. దయగల, బాధ్యతగల పౌరుల నేతృత్వంలోని మంచి భవిష్యత్తును ఇలాంటి సంఘటనలు వాగ్దానం చేస్తాయి ' అని ట్విట్టర్‌లో చంద్రబాబు అభినందించారు.

# పలు జిల్లాలకు వర్షసూచన

### అధికారులను అప్రమత్తం చేసిన చంద్రబాబు

**విజయవాడ,సెప్టెంబర్9:** ఆంధ్రప్రదేశ్‌ను వర్షాలు ఇప్పట్లో వదిలేలా లేవు. ఒకటి రెండు గంటలు గ్యాప్ ఇచ్చి ఆ తర్వాత నాన్ స్టాప్‌గా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. భారీ వర్షాల ధాటికి విజయవాడ విల విల్లాడుతున్న సంగతి తెలిసిందే. వర్షాలు, వరద ధాటి నుంచి తేరుకోకమునుపే విశాఖపట్నం వాతావరణ శాఖ మరో షాకింగ్ న్యూస్ వెల్లడించింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీంతో బెజవాడ వాసుల్లో మళ్లీ ఆందోళన మొదలయ్యింది. తీవ్ర వాయుగుండం తీరం దాటిన తర్వాత మరికొన్ని గంటలు తీవ్ర వాయుగుండంగా కొనసాగే అవకాశం ఉంది. సోమవారం అర్ధరాత్రికి క్రమంగా బలహీనపడి వాయుగుండంగా మారే ఛాన్స్ ఉందని అధికారులు చెబుతున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో చాలా చోట్లా మోస్తరు వర్షాలు కురవనున్నాయి. ముఖ్యంగా.. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# మేడారం విపత్తుపై ఎన్‌ఆర్‌ఎస్సీ, వాతావరణ శాఖ విచారణ

### క్లౌడ్ బరసట్ వల్లనే విపత్తు సంభవించిందన్న అటవీశాఖ

**తొలి సమయం వరంగల్,సెప్టెంబర్ 9:** ములుగు జిల్లా మేడారం అడవుల్లో ఘోర విపత్తుపై ఎన్‌ఆర్‌ఎస్సీ, వాతావరణ శాఖ విచారణ చేపట్టింది. అడవుల్లో వాతావరణ పరిస్థితులను ఎన్‌ఆర్‌ఎస్సీ నమోదు చేసుకుంది. 2018 జనవరి 22న మేడారంలోని చిలకల గుట్టలో టోర్నడోలాంటి సుడిగాలి బీభత్సం సృష్టించింది. మేడారంలో అడవుల్లో టోర్నడోలా బీభత్సం వల్లే అడవులు ధ్వంసమైనట్లు అధికారులు నిర్ధారణకు వస్తున్నారు. అలాగే మేడారం అడవుల్లో ఘోర విపత్తుపై ప్రభుత్వానికి అటవీ రక్షణ ప్రధానాధికారి డోబ్రియాల్ని రెండు రోజుల క్రితం నివేదిక ఇచ్చారు.

క్లౌడ్ బరస్ట్ వల్లే ఈ విపత్తు సంభవించిందని... మేఘాలు కిందకు వచ్చి బరస్ట్ కావడంతోనే చెట్లు నేలకూలాయని తెలిపారు. 3 కిలోమీటర్ల పొడవు, 2 కిలో మీటర్ల వెడల్పులో 204 హైక్టార్లలో 50వేల చెట్లు కూలాయన్నారు. క్లౌడ్ బరస్ట్ ఎందుకు జరిగిందో తెలుసుకోవాలని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ తెలియజేశామన్నారు. కూలిన చెట్లను వారంలోగా డిపోలకు తరలిస్తామన్నారు. మేడారం అడవుల్లో చెట్ల వేళ్లు లోతుగా లేవని... అందుకే వందల ఎకరాల్లో అడవి ధ్వంసమైందని ప్రభుత్వానికి పంపిన నివేదికలో పీసీసీఎఫ్ పేర్కొన్నారు. కాగా.. ఆగస్టు 31న ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం అడవుల్లో సుమారు 50 వేల చెట్లు నేలమట్టమైన విషయం తెలిసిందే. 200 హెక్టార్లలో విస్తరించి ఉన్న ఈ అడవుల్లో పెద్దఎ త్తున గాలిదుమారం, సుడిగాలుల బీభత్సంతో మహావృక్షాలు సైతం చిగురుటాకుల్లా రాలిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నెల 1న పరిశీలనకు వెళ్లిన అధికారులు.. ఈ దృశ్యాలను చూసి, షాక్‌కు గురయ్యారు. అయితే.. టోర్నడోల్లాంటి బలమైన సుడిగాలులే ఈ స్థాయిలో చెట్లను కూల్చివేస్తాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. 'టోర్నడోలు ఒక స్పష్టమైన మార్గంలో వెళ్తాయి. కుప్పకూలిన చెట్లు కూడా ఒకవైపే పడి ఉన్నాయి. భారీ వృక్షాలు కూడా నేలకొరగడాన్ని బట్టి.. కనీసం గంటకు 120 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులే దీనికి కారణమై ఉండొచ్చు' అని వివరించారు. అయితే 50 వేల చెట్లు ఒకేసారి నేలకొరగడంపై సమగ్ర విచారణ జరుపుతున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై డీఎ?ఫవో రాహుల్ జావేద్ నేతృత్వంలోని బృందం ఉపగ్రహ డేటా, భారత వాతావరణ శాఖ(ఐఎండీ), నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌తో కలిసి పరిశీలన జరుపుతోంది. మంగళవారం ఆయన.. సీసీఎఫ్ ప్రభాకర్‌తో కలిసి తాడ్వాయ్-మేడారం అడవుల్లో నేలమట్టమైన చెట్లను పరిశీలించారు.

## వరదప్రాంతాల్లో 95శాతం విద్యుత్ పునరుద్ధరణ: మంత్రి

**విజయవాడ,సెప్టెంబర్ 9:** వరద ప్రాంతాల్లో 95శాతం విద్యుత్ పునరుద్ధరణ చేశామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. లంక గ్రామాల్లో పూర్తిగా విద్యుత్ పునరుద్ధరించినట్లు చెప్పారు. విద్యుత్ పునరుద్ధరణ కాని వరద ప్రాంతాల్లో మంత్రులు గొట్టిపాటి, డోలా బాల వీరాంజనేయస్వామి సోమవారం పర్యటించారు.

# వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వో

### జయలక్ష్మి తీరుపై ప్రభుత్వం సీరియస్

### విధుల నుంచి తప్పించిన కృష్ణా జిల్లా కలెక్టర్

**విజయవాడ,సెప్టెంబర్9:** వరద బాధితులపై చేయి చేసుకున్న వీఆర్వో జయలక్ష్మి తీరుపై ప్రభుత్వం సీరియస్ అయింది. వీఆర్వోను విధుల నుంచి తప్పిస్తున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ సృజన వెల్లడించారు. ఆమెకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. బాధితులతో సంయమనంగా వ్యవహరించాలని ఇప్పటికే చంద్రబాబు అధికారులకు సూచించారు. బాధల్లో ఉన్న బాధితులు ఓ మాట అన్నా.. ఓపిగ్గా సమాధానం చెప్పాలని సీఎం ఆదేశాలు ఇచ్చారు. అయినా పలువురు ఉద్యోగుల తీరు మారట్లేదు. దీంతో అలాంటి వారి విషయంలో ప్రభుత్వం కఠిన వ్యవహరిస్తోంది. మంచినీరు, ఆహారం తమ వీధిలోకి అందలేదని విజయవాడలో వరద బాధితులు ప్రశ్నించినందుకు వీఆర్వో జయలక్ష్మి ఒకరి చెంప పగలగొట్టారు. అక్కడితో ఆగకుండా పోలీసులు ముందే బాధితుడిని దుర్భాషలాడారు. నన్నే ప్రశ్నిస్తావా?అంటూ బాధితులపైనే అధికారులకు ఫిర్యాదు చేశారు. భోజనాలు, మంచినీరు అందటం లేదని ప్రశ్నించినందుకు ఇలా ఓ వీఆర్వో, వరద బాధితులపై చేయి చేసుకోవడం వివాదానికి దారి తీసింది. ఆమె వైఖరిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే ఉన్నతాధికారులు ఆమెపై చర్యలు తీసుకున్నారు.

# పౌర విమానరంగం అభివృద్ధి లక్ష్యంగా అడుగుల

### 11, 12 తేదీల్లో భారత మండపం సదస్సుకు భారత్ ఆతిథ్యం

### కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్

**న్యూఢిల్లీ,సెప్టెంబర్9:** మెరుగైన వస్తు రవాణాతో పాటు, పరస్పర సహకారంతో పాటు, అనుభవాలను పంచుకోవడంపై దృష్టి సారించినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. భారత పౌర విమానయానాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నామని అన్నారు. గ్రీన్ ఫీల్డ్, ఎయిర్ పోర్ట్‌లు, ప్రయాణ సౌకర్యాలు, ఫ్యూయల్, పౌర విమానయాన వ్యవస్థల అభివృద్ధిపై చర్చలు జరుగుతాయని చెప్పారు. పౌర విమానయానంపై ఢిల్లీలో రెండు రోజుల పాటు రెండో ఆసియా పసిఫిక్ సివిల్ ఏవియేషన్ మంత్రుల సమావేశం ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. కాగా, ముగింపు కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరవుతారని తెలిపారు.ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ... ఈ నెల 11, 12 తేదీల్లో 'భారత మండపం' లో జరిగే సమావేశానికి భారత్ ఆతిథ్యం ఇస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొంటున్న 41 దేశాలకు చెందిన పౌరవిమానయాన శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. దేశంలో పౌర విమానయాన రంగం అభివృద్ధి, 41 దేశాల మధ్య విమాన సౌకర్యాలను మెరుగు పరచడంపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి పాకిస్తాన్ హాజరు కావడం లేదని స్పష్టం చేశారు. చైనా హాజరుపై సంప్రదింపుల ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# చంద్రబాబు అరెస్ట్ రోజు బ్లాక్‌డే

### టెర్రరిస్ట్‌లా ఐదేళ్లు ఏపీని పరిపాలించిన జగన్

### రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

**అమరావతి,సెప్టెంబర్9:** వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో చంద్రబాబు అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తూ.. ఈ రోజును బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మాజీ సీఎం జగన్ రెడ్డి ఒక టెర్రరిస్ట్‌లా గత ఐదేళ్లు ఏపీని పరిపాలించారని విమర్శలు చేశారు. జగన్ రెడ్డి పాలనలో ఎవరికీ నిద్రలేదని ఆరోపించారు. సీఎం చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి కొండను తవ్వి ఎలుకను పట్టుకున్నట్లుగా వ్యవహరించారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శలు చేశారు.అక్రమంగా చంద్రబాబును 53 రోజులు జైల్లో పెట్టారని అన్నారు. రూ.3000 వేల కోట్ల మోసం అంటూ.. 30 పైసలు కూడా బయట పెట్టలేకపోయారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి తన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఎవరి మాన ప్రాణాలనైనా తీస్తారని ఆరోపించారు. నాడు పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని చట్టాన్ని చుట్టంలా వాడుకున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి విమర్శలు చేశారు. నేడు పచ్చకామెర్లోడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు బెంగళూరులో కూర్చుని జగన్ పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. వరదబాధితులకు సాయం చేయకపోగా.. పిచ్చి ప్రేళాపనలు పేలుతున్నారని విమర్శించారు. చంద్రబాబు చొరవతోనే విరాళాలు ఇవ్వడానికి పలువురు ముందుకు వస్తున్నారని వివరించారు. భారీ వర్షాల సమయంలో యంత్రాంగం చురుగ్గా పనిచేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రశంసించారు. కేంద్రమంత్రులు సైతం వచ్చి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి, బాధితులను పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెబుతున్నారని అన్నారు. అబద్దాలను నమ్ముకున్న వైసీపీకి భవిష్యత్ లేదని ఆక్షేపించారు. వైసీపీలో ఆ 11 సీట్లు కూడా పోయి జగన్ ఒక్కడే ఆ పార్టీలో మిగలడం ఖాయమని ఎద్దేవా చేశారు, చంద్రబాబు పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని.. తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీ అమలు చేస్తున్నామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

# ఢిల్లీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి ఇంట్లో సోదాలు

### సిబిఐ సోదాల్లో రూ. 2.39 కోట్ల నగదు పట్టివేత

**న్యూఢిల్లీ,సెప్టెంబర్9:** ఢిల్లీ పోల్యూషన్ కంట్రోల్ కమిటీ ఎన్విరాన్‌మెంట్ సీనియర్ ఇంజినీర్ మహమ్మద్ ఆరీఫ్ నివాసంలో సోమవారం సీబీఐ సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా రూ. 2.39 కోట్ల నగదును సీబీఐ అధికారులు స్వాధీనం చేసుకుని.. సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఇంజినీర్ అరీఫ్‌తోపాటు పలువురిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ప్రైవేట్ సంస్థలకు లైసెన్స్‌లు పునరుద్ధరించే క్రమంలో డీపీసీసీ అనుమతి పొందవలసి ఉంది. అందులోభాగంగా పలు సంస్థల యజమానులు డీపీసీసీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నారు. దాంతో మధ్యవర్తుల ద్వారా ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ అరీఫ్ భారీగా నగదు డిమాండ్ చేశారు. దీంతో వివిధ సంస్థల యజమానులు.. సీబీఐను ఆశ్రయించారు. దాంతో రూ. 91,500 నగదు లంచంగా తీసుకున్న కేసులో ఆరీఫ్, కషలయ శరణ్ సింగ్‌తోపాటు అతడి కుమారుడిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు.

# ఒడిషా తీరం దాటిన వాయుగుండం

### రాష్ట్రంలో మరో 24 గంటల పాటు ప్రభావం

**విశాఖపట్టణం,సెప్టెంబర్9(ఆర్ఎన్ఎ):** బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం భారత వాతావరణ శాఖ అంచనాలకు తగ్గట్టుగానే ఒడిశాలోని పూరీ దగ్గర ఉదయం 11:30 గంటలకు తీరం దాటింది. దీని ప్రభావం రాష్ట్రంలో మరో 24 గంటల పాటు ఉంటుందని వాతావరణ అధికారులు వెల్లడించారు. వాయుగుండం అదే తీవ్రతతో సోమవారం అర్ధరాత్రి వరకూ కొనసాగుతూ బలహీనపడుతుందని విశాఖ తుపాన్ హెచ్చరికల కేంద్రం అంచనా వేస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. అటు, తూ.గో, పశ్చిమగోదావరితో పాటు ఉమ్మడి కృష్ణా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. అలాగే, విశాఖ, తూ.గో జిల్లాలకు ఎ÷-లాష్ ఫ్లడ్స్ వచ్చే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. గంటకు 30 - 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు. మరోవైపు, వాయుగుండం ప్రభావంతో దక్షిణ ఒడిశా జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. మల్కాన్‌గిరిలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

# గుండెపోటుతో జర్నలిస్ట్ మృతి



## చింతలపల్లి లో నేడు హింగె అశోక్ అంత్యక్రియలు

**తొలి సమయం ఎల్కతుర్తి సెప్టెంబర్ 09**
ఎల్కతుర్తి మండలం చింతలపల్లి గ్రామానికి చెందిన హింగె అశోక్ సోమవారం ఉదయం హైదరాబాద్ లో కిమ్స్ దవాఖానలో చనిపోయారు. పది రోజుల క్రితం గుండెపోటు రావడంతో అశోక్ ను హైదరాబాద్ కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో సోమవారం ఉదయం చనిపోయారు. అశోక్ ఎల్కతుర్తి బస్టాండ్ ప్రాంతంలో అందరికీ సుపరిచితుడు. 1995-2000 సంవత్సరం లో జీపు నడిపిస్తూ జీవనం సాగించేవారు. తదనాంతరం వ్యవసాయం చేస్తూనే వివిధ పత్రికలలో విలేకరిగా పనిచేశారు. ప్రస్తుతం "జన సముద్రం" రిపోర్టర్ గా కొనసాగుతున్నారు. అశోక్ కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కుమార్తె వివాహం జరిగింది. చిన్న కుమార్తె వివాహం జరగాల్సి ఉంది. నవ తెలంగాణ ఎల్కతుర్తి రిపోర్టర్ హింగె రాజేశ్వరరావుకు అశోక్ స్వయన తమ్ముడు. అశోక్ మృతదేహాన్ని హైదరాబాద్ నుండి తీసుకురావాల్సి ఉంది. మంగళవారం ఉదయం అతడి స్వగ్రామం చింతలపల్లి లో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అశోక్ మృతి చెందాడన్న సమాచారం తెలుసుకున్న తోటి మిత్రులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు అతడి ఇంటికి తండోపతండాలుగా చేరుకుని సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తమతో ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకున్నారు. బి అర్ ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, మాజీ అధ్యక్షుడు సుకినె సంతాజీ, టీ పీసీసీ కార్యదర్శి బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, నాయకులు డాక్టర్ బొల్లెపోగు రమేశ్ బాబు, శనిగరపు స్వరూప, వెంకటేష్, మండ సుమన్, సొసైటీ చైర్మన్ రవీందర్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కడారి రాజు, ఎల్తూరి స్వామి, అడ్వకేట్ బోనగిరి కుమారస్వామి, సీపీఐ మండల అధ్యక్షుడు రాములు, బీజేపీ మండల అధ్యక్షుడు కుడుతాడి చిరంజీవి, సీనియర్ నాయకులు సాతూరి వెంకన్న మాదిగ, టీడీపీ నాయకులు నసూర్, మాజీ సర్పంచ్ కొమ్మిడి నిరంజన్ రెడ్డి, సీనియర్ పాత్రికేయులు గడ్డం రాజిరెడ్డి, ఎల్కతుర్తి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ధన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు, అధికారులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ పార్టీల లీడర్లు సంతాపం తెలిపారు.

# ఘనంగా ప్రజాకవి కాళోజీ జయంతి వేడుకలు










**తొలి సమయం ఎల్కతుర్తి సెప్టెంబర్ 09**
స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం ను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వల్భాపూర్ లో ప్రధానోపాధ్యాయులు బద్దం సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిoచారు.కాళోజీ నారాయణ రావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాళోజీ నారాయణరావు తెలుగు భాష కు తెలంగాణ యాస కు ఎనలేని కృషి చేశారని, బడి పలుకుల భాష కాకుండా పలుకుబడుల భాష గా తెలంగాణ యాస ను బ్రతికించార ని చెప్పారు. ఒక జాతి పట్ల జరుగుతున్న వివక్షను, అన్యాయాన్ని ఎలుగెత్తిన స్వాభిమానిగా ఆయన్ని ప్రాంతాలకు అతీతంగా అభిమానించారు.జీవితాంతం ఉద్యమ కవితాన్ని వినిపిస్తూ తెలంగాణ ప్రజలలో స్వరాష్ట్ర ఆకాంక్షను రగిలిస్తూ కవిగా అన్ని ప్రాంతాల ప్రజల అభిమానాన్ని చూరగొన్న విశ్వజనీన కవి కాళోజీ అని అన్నారు. పుట్టుక నీది చావు నీది జీవితమంతా దేశానిది అని ఎలుగెత్తి చాటి తన మరణం తరువాత తన పార్థివ శరీరాన్ని వైద్య కళాశాలకు ఇచ్చిన మహానుభావుడు ఆయన అనిఅన్నారు.పరభాషాలను నేర్చుకోవటాన్ని కాళోజీ ఎప్పుడు వ్యతిరేకించాలే కానీ ఆ సాకుతో మాతృభాషను నిర్లక్ష్యం చేయటాన్ని మాత్రం సహించేవారు కాదు. నేటి తరం తెలుగు పదాలనే మర్చిపోతోందని కాళోజీ ఆవేదన చెందే వారు. తేటతెలుగు భాషకు పూర్వ వైభవం రావాలని ఆకాంక్షించే వారు.'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై పోరాడిన ప్రజాకవిగా కీర్తి గాంచిన కవి కాళోజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు రఘురామ్, రమేష్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటస్వామి ,పద్మలత ,రాధిక, ప్రేమ ప్రసాద్ రావు ఎఎపిసి చైర్మన్ నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# అవినీతి డీఈఓ కు జిల్లా కలెక్టర్ అండదండలు

**- సీ.ఎం. దృష్టికి జిల్లా కలెక్టర్ పని తీరు, డీఈవో అవినీతి అంశాలు - ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాం.రాజయ్య**







**తొలి సమయం కరీంనగర్ సెప్టెంబర్ 09**
తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పనితీరు, వ్యవహార శైలి, డీఈవో కరీంనగర్ జనార్దన్ రావు అవినీతి బాగోతాలు తదితర అంశాలను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాం. రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అయన మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక ప్రభుత్వ ఉపాధ్యాయుడు డి ఈ ఓ కు సంబంధించిన సర్టిఫికెట్లు, డీఈఓ ఆఫీస్ కు మంజూరు కాపాడిన నిధులు, తీర్మానాలు, యూసీలు తదితర వివరాలను సమాచార హక్కు చట్టం (ఆర్టిఐ) ద్వారా కోరగా దళిత సామాజిక వర్గానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు (రాం. రాజయ్య) ని తీవ్ర అణచి వేతకు గురి చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ డీఈవోలు ఇద్దరు ఒకే సామాజిక వర్గం (బ్రాహ్మణులు) కావడం గమనార్హం. తీవ్ర అచివేతకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డీఈవో ఆఫీసుకు సంబంధించిన నిధులు, ప్రభుత్వ వాహనం నెంబరు, పెట్రోల్/ డీజిల్ బిల్లు రసీదులు, రహస్యంగా ఉంచుతూ బయటకి రానివ్వడం లేదు. డీఈవో కరీంనగర్ జనార్దన్ రావు అవినీతికి జిల్లా కలెక్టర్ కరీంనగర్ పమేలా సత్పతి (మేడం) అండదండలు ఉండడం విశేషం. ఈ విషయాలపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సి.ఎస్. శాంతి కుమారి (మేడం) తక్షణమే స్పందించి ప్రభుత్వ నాకు న్యాయం చేకూర్చాలని కోరారు.

# ఎల్‌బి విద్యా కళాశాలలో బతుకమ్మ, రంగోళి సంబరాలు







**తొలి సమయం వరంగల్ సెప్టెంబర్ 09**
వరంగల్ ములుగు రోడ్డులోని ఎల్ బి విద్యా కళాశాలలో ఆర్ట్,డ్రామా లో భాగంగా సోమవారం బతుకమ్మ , రంగోలి, మెహెంది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.బి . ఎడ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కోర్సు లో భాగంగా ఆర్ట్ డ్రామా సంబంధిత సహపాఠ్య కార్యక్రమాలను నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ కె లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ చదువులోనే కాకుండా ఇతర కళలందు కూడా ముందుండాలని రాబోయే తరానికి సంస్కృతి సంప్రదాయాలను అందించే బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ ఉదయ రేఖ తో పాటు లెక్చరర్లు ఉమ మహేశ్వరి, శ్రీలత, మంజుల, మమత, ధనలక్ష్మి, శారద, స్వప్న, రజిత, రాధ, నీలోఫర్, కుమారస్వామి, రామయ్య, నాన్ టీచింగ్ స్టాఫ్ సుమన్, వెంకన్న, అటెండర్లు అనిత, స్వప్న, చంద్రయ్య, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

# సుబ్బంపేటలో ఆరోగ్య శిబిరం



**తొలి సమయం చర్ల సెప్టెంబర్ 09**
సోమవారం సుబ్బంపేట గ్రామంలో డాక్టర్ పూజ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు.ఆరోగ్య శిబిరంలో 44 మంది వ్యాధులకు వైద్యం తీసుకున్నారు. జ్వరం తో బాధపడుతున్న ఒక వ్యక్తి కి వైద్యం అందించటం జరిగినది.డాక్టర్ పూజ మాట్లాడుతూ ఎడతెగని వర్షాలు కారణంగ సీజనల్ వ్యధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్త గా ఉండాలని,బయట దొరికే ఆయిల్ ఫుడ్స్ తీసుకోరాదు అని, ఆహారం వేడి వేడి గ ఉన్నప్పుడే తినాలని ఈగలు వాలకుండా ఆహారం మీద మూతలు ఉంచాలని తెలియ జేశారు. నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలని తెలియ జేశారు.దోమలు కుట్టకుండా చూసుకోవాలని అనవసరంగా వానలో తడవకూడదని బయటకు వెళ్లాల్సి వస్తె తప్పకుండా గొడుగు లేదా రెయిన్ కోట్ వాడాలని తెలియ జేశారు.ఎవరికైన జ్వరం వస్తె వెంటనే ప్రభుత్వ వైద్యశాల కు రావాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ హైమావతి, ఆశా సమ్మక్క పాల్గొన్నారు.

# ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు ఆహ్వానం

**దరఖాస్తుకు ఈ నెల 20 చివరి గడువు**

**తొలి సమయం హన్మకొండ సెప్టెంబర్ 09**
రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ ట్రేడ్లలో శిక్షణ పొందేందుకు మూడవ దఫా భర్తీ అనంతరం మిగిలిన సీట్లను నాలుగో విడుతలో భర్తీ చేయడం కోసం ఈనెల 20వ తేదీ ఉ.11 లోగా **www.iti.telangana.gov.in** వెబ్ సైట్ ఆసక్తిగల అభ్యర్థులు అన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని హన్మకొండ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సక్రు నేడోక ప్రకటనలో తెలిపారు. రోజువారీ మెరిట్ జాబితా ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుందని ప్రభుత్వ /ప్రైవేట్ ఐ టి ఐలో 4వ దఫా వాక్ ఇన్ అడ్మిషన్ ల కోసం కూడా ఈ నెల 20వ తేది ఉ.11లోగా దరఖాస్తు చేయవచ్చని లేదా సంబంధిత ఐ టి ఐ కళాశాలలో రిజిస్ట్రేషన్ ఫారం పొంది అందులో సూచించిన ధృవ పత్రాలు జతపరచి భౌతికంగా అందజేయాలని, గతంలో దరఖాస్తు చేసుకున్నవారు దరఖాస్తు చేసుకోనవసరం లేదని, కొత్తవారు మాత్రమే దరఖాస్తు చేసుకుంటే సరిపోతుందని ప్రిన్సిపల్ సక్రు తెలిపారు.

# పేరూరు ఆశ్రమ పాఠశాలలో ఘనంగా ప్రజా కవి కాలోజి జయంతి వేడుకలు



**తొలి సమయం వాజేడు సెప్టెంబర్ 09**
ములుగు జిల్లా వాజేడుమండలంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా తెలంగాణ భాషా దినోత్సవం పేరూరు ఆశ్రమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శవి.నారాయణ మాట్లాడుతూ కాళోజీ గురించి పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది అని కాళోజి గురించి పిల్లలకి అనేక విషయాలు తెలియ జేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం,స్టాఫ్ సెక్రటరీ నాగమణి , పి నర్సింగారావు,పిడి లక్ష్మీనారాయణ, నాగేంద్ర ప్రసాద్, డిప్యూటీ వార్డెన్ శ్రీను, పార్వతి, ఈశ్వర్ ,రవీంద్ర ప్రసాద్, యశోద, లక్ష్మీనారాయణ ,సాయి, పవన్ పాఠశాల బాల,బాలికలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ ఎస్సీ బాలుర పాఠశాలలో సభ్యత నమోదు కార్యక్రమం

**అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్**



**తొలి సమయం ఎల్కతుర్తి సెప్టెంబర్ 09**
ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎల్కతుర్తిలోని ఎస్సీ బాలుర పాఠశాలలో సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు వుట్కూరి ప్రణీత్ గౌడ్ మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ శాస్త్రీయ విద్యా విధానం కొరకై, విద్య ప్రైవేటీకరణ, విద్య కార్పొరేట్ కు వ్యతిరేకంగా ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణ ఏకైక ఎజెండాగా పోరాడుతున్నదని బిజెపి ప్రభుత్వం విద్య కాషాయీకరణ, విద్య ప్రైవేటీకరణ వైపు చాలా ఆసక్తిగా అడుగులు వేస్తున్నదని దేశంలో ప్రభుత్వ విద్యారంగాన్ని పేద, బడుగు బలహీన వర్గాలకు విద్యను అందని ద్రాక్షలా మారుస్తుందని అందులో భాగంగానే నూతన జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టిందని దీనితో విద్యారంగంలో శాస్త్రీయత దెబ్బతింటుందని విద్యారంగం గుండు గుత్తగా కార్పొరేట్ కబంధహస్తాల్లోకెళ్లే అతి పెద్ద ప్రమాదం దాగి ఉందని దీనికి వ్యతిరేకంగా విద్యార్థులు ఆందోళన పోరాటానికి సిద్ధం కావాలని విద్యార్థులు విద్యతో పాటు తమ హక్కుల కోసం పోరాటం చేస్తూ ముందుకు సాగాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు ఉప్పుల వినయ్, ముంజ సంపత్, కొండా చరణ్, సహర్ష్, తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డికే ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలి

**రెడ్డి జేఏసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కర్ర శ్రీధర్ రెడ్డి**



**తొలి సమయం కరీంనగర్ సెప్టెంబర్ 09**
ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఉటుకూరి నరేందర్ రెడ్డి కి ఎమ్మెల్సీ టికెట్ కేటాయించాలని రెడ్డి జేఏసీ విద్యార్థి విభాగం కర్రే శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ తను ప్రముఖ విద్యావేత్త అని జిల్లాలలో అన్ని వర్గాల వారితో, రాజకీయ నాయకులతో, తల్లిదండ్రులతో, పూర్వపు విద్యార్థులతో, అందులో పని చేసే ఉపాధ్యాయులతో మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ఏ ప్రభుత్వమైనా పటిష్టంగా ఉండాలంటే విద్య వైద్యం సామాన్యులకు అందుబాటులో ఉండాలనిఅతను అన్నారు. నరేందర్ రెడ్డి కి విద్యా వ్యవస్థ పై పూర్తిగా అవగాహన ఉంది కాబట్టి, కష్టకాలంలో కూడా పార్టీ కోసం పని చేశారని అని అన్నారు. నరేందర్ రెడ్డి కి టికెట్ ఇస్తే పార్టీలకు అతీతంగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని అతను అన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST: MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101